సాక్షి తిరుపతి

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



వినూత్న ఆలోచనలు..

తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అద్భుతాలు ఆవిష్కరిస్తున్నారు. - 8లో



పవిత్రం.. పెరటాసి మాసం

తిరుమల శ్రీవారు అవతరించిన పవిత్ర పెరటాసి మాసం మంగళవారం ప్రారంభమవుతోంది. - 8లో



వేడుకగా ఊంజల్‌సేవ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. - 8లో

ప్రైవేటు పరం చేయొద్దు




వైద్య విద్య అభ్యసించే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. అయితే ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఈ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమవుతోంది. వైద్య విద్య అభ్యసించాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అలాంటిది ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే ఫీజులు తడిసి మోపెడవుతాయి. తద్వారా మెరిట్ సాధించిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత సీట్లు అందక వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుంది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలి.

– టి.అజిత్, నీట్ విద్యార్థి, తిరుపతి



కొత్త మెడికల్ కళాశాలలతోనే మరిన్ని సీట్లు



కొత్త మెడికల్ కళాశాలలతోనే మరిన్ని సీట్లు అందుబాటులోకి వస్తాయి. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. అందులో ఈ ఏడాది కొన్ని, మరికొన్ని వచ్చే ఏడాదిలో ప్రారంభం కానుంది. దీనివల్లదాదాపుగా 2 వేల సీట్లు అదనంగా విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. పేద, మధ్య తరగతి విద్యార్థుల డాక్టర్ కల నెరవేరుతుంది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో సీట్లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

– జె.చైతన్యరెడ్డి, నీట్ విద్యార్థి, తిరుపతి


ఉన్నత విద్యకు ఉరి

విశ్వవిద్యాలయాల భవిత ప్రమాదంలో పడింది. విద్యను వ్యాపారంగా పూర్తి స్థాయిలో మార్చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గతంలో సర్కారు బడులను భ్రష్టుపట్టించిన చంద్రబాబు.. ఇప్పుడు ఉన్నత చదువులకు నెలవైన యూనివర్సిటీలకు గ్రహణం పట్టించేందుకు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ పేరిట పారిశ్రామికవేత్తల చేతిలో వర్సిటీ పాలన పెట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ఈసీలను బ్యూరోక్రటిక్ బాడీలుగా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల మనుగడపై విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువత భవిష్యత్‌ను సమూలంగా నాశనం చేసే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

- పారిశ్రామికవేత్తల చేతుల్లోకి యూనివర్సిటీలు
- బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ పేరుతో బడా'బాబు'లకు పగ్గాలు
- బ్యూరోక్రటిక్ బాడీలుగా మారనున్న ఈసీలు
- విశ్వవిద్యాలయాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే సహించమంటున్న విద్యార్థి సంఘాలు



ఎస్వీయూ పరిపాలనా భవనం





తిరుపతి సిటీ : ఉన్నత విద్యకు నెలవుగా మారిన యూనివర్సిటీల భవిష్యత్తు అగమ్యగోచరంలో పడింది. వర్సిటీలను బడా పారిశ్రామిక వేత్తల చేతిలో పెట్టేందుకు చంద్రబాబు సర్కార్ సిద్ధమవుతోంది. ఆదిశగా ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గతంలో 14ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు పాఠశాల విద్యను నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాల్లోకి నెట్టేశారు. అదే తరహాలో ప్రస్తుతం యూనివర్సిటీలను పారిశ్రామిక వేత్తల చేతుల్లో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం వర్సిటీల చట్టాలకు సవరణలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పాలకమండళ్లను రద్దు చేసి ఆ స్థానంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ పేరుతో పారిశ్రామిక వేత్తలను, కార్పొరేట్ వ్యక్తులను మెంబర్లుగా నియమించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు.వీరితో బ్యూరోక్రాటిక్ బాడీలను తయారు చేసేందుకు అడుగులు వేస్తున్నారు.

పాలకమండలి స్థానంలోనే..

ప్రస్తుతం వర్సిటీలో కొనసాగుతున్న పాలకమండళ్లను (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్) రద్దు చేసి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌ను ప్రభుత్వం నియమించనుంది. ప్రస్తుతం ఈసీలో వీసీ, ప్రిన్సిపల్, ప్రొఫెసర్, డిగ్రీ కళాశాల యాజమాన్యాలు, విద్యావేత్తలు, నిపుణులు సభ్యులుగా కొనసాగుతున్నారు. వారి స్థానంలో ఇక నుంచి పారిశ్రామిక వేత్తలను బోర్డు మెంబర్లుగా నియమించి వారు ఆదేశించిన విధంగా వర్సిటీలో పాలన, విద్యావ్యవస్థలో మార్పులు చేయాల్సి ఉంటుంది. వారు ఆదేశించిన ప్రకారమే వర్సిటీల్లో కోర్సులను ప్రవేశపెట్టాల్సి ఉంది.

చట్టాల సవరణకు రంగం సిద్ధం

వర్సిటీలలో ప్రస్తుతం అమలు చేస్తున్న చట్టాలను భారీ స్థాయిలో మార్పులు చేసేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం జిల్లాలోని ఆరు వర్సిటీలలో రెండు వర్సిటీలకు వాటి స్థాయి, అవసరాలు, సంస్థాగత నిర్మాణం మేరకు చట్టాలను తీసుకువచ్చారు. ఇందులో పద్మావతి మహిళా వర్సిటీ, కుప్పం ద్రవిడ వర్సిటీకి ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయి. ఎస్వీయూ, వెటర్నరీ, వేదిక్, స్విమ్స్ వర్సిటీలకు మరో చట్టం అమలులో ఉంది. ఒకే చట్టం తీసుకువచ్చి అన్ని వర్సిటీలను ప్రైవేటు వ్యక్తుల చేతులలో పెట్టేందుకు చంద్రబాబు కుట్రపూరితంగా పన్నాగాలు పన్నుతున్నారు.

భ్రష్టుపట్టిస్తోంది



వర్సిటీలను కూటమి ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది. పాలకమండళ్లను రద్దు చేసి లాభార్జనే ధ్యేయంగా పనిచేసే ప్రైవేటు వ్యక్తులను బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ పేరుతో నియమించడం దారుణం. అలా చేస్తే ఉన్నత విద్య సైతం వ్యాపారంలా మారుతుంది. పేద విద్యార్థులు వర్సిటీలను దేవాలయాలుగా భావిస్తారు. విశ్వవిద్యాలయాలను స్వార్థపరుల చేతుల్లో పెడితే ఉద్యమం తప్ప దు.

– హరీష్, ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ సభ్యుడు

పేద విద్యార్థులకు అన్యాయం



వర్సిటీ చట్టాలను బాబు తన చుట్టాలకు అనుగుణంగా మార్చుకుంటే పోరాటం తప్పదు. ప్రాథమిక, ఉన్నత విద్యను ఇప్పటికే ప్రైవేటు పరం చేశారు. వర్సిటీలల్లో కార్పొరేట్ వ్యక్తులను పాలకులుగా నియమిస్తే వారు తమ స్వలాభం కోసం సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు అన్యాయం చేస్తారు. ఇలాంటి నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

– రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

హక్కులు ఉండవు



యూనివర్సిటీలలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ పేరుతో ప్రైవేటు వ్యక్తులను పాలకులుగా నియమిస్తే వారు విద్యను వ్యాపారం చేసి దండుకుంటారు. విద్యార్థులకు, వర్సిటీలలో పనిచేసే ఉద్యోగులకు, అధ్యాపకులకు యూనివర్సిటీలపై ఎటువంటి హక్కులు ఉండవు. అన్ని ప్రైవేటు వ్యక్తుల చేతులలో ఉంటాయి, వారు చెప్పిన విధంగా వర్సిటీలు నడుచుకోవాల్సి ఉంటుంది. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పోరాటాలకు పిలుపునిస్తాం.

– నవీన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

వ్యాపారం చేస్తే ఊరుకోం



వర్సిటీలో అత్యధికంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నది ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద విద్యార్థులే. అటువంటి దేవాలయాలను ప్రైవేటు పరం చేసే ప్రయత్నం చేస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదు. వర్సిటీలో పాలకమండలిలో విద్యావంతులు, మేధావులు, అధ్యాపకులు ఉండాలి తప్ప, ప్రైవేటు వ్యక్తులు, పారిశ్రామిక బడానేతలకు చోటు ఇవ్వకూడదు. విద్యను వ్యాపారం చేస్తే ఊరుకోం.

– ఆషా, పీడీఎస్ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

పెత్తనం సహించం



ఉన్నత విద్యాసంస్థలలో బడాబాబుల పెత్తనం సహించేది లేదు. ఇలాంటి పరిణామాలతో ఉన్నత విద్య కొంతమందికే అందుబాటులోకి వస్తుంది. పారిశ్రామిక వేత్తలు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే స్వార్థంతో వర్సిటీలో తమకు అవసరమైన కోర్సులను ప్రవేశపెడతారు. విద్యాలయాన్ని వ్యాపార సంస్థగా తయారు చేసే ప్రమాదం ఉంది. వెంటనే చట్టాల సవరణను వెనక్కి తీసేకోవాలి. లేదంటే అసెంబ్లీ ముట్టడి తప్పదు

– ఆది, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి, తిరుపతి

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తు గడువు 23 వరకు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తు ఎలా చేసుకోవాలి వంటి పూర్తి వివరాలకు తమ సమాచార కేంద్రాన్ని నేరుగా లేదా 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన కోరారు.

డిగ్రీ, పీజీ కళాశాలల్లో అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ కోసం మూడో విడత కౌన్సిలింగ్‌కు సంబంధించి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. 22న మూడో విడత సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు. అలాగే మంగళవారం నుంచి ఎస్వీయూ, పద్మావతీ వర్సిటీల్లో రెండో విడత పీజీ సెట్–2024 కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలవనుంది. వెటర్నరీ వర్సిటీలో ఈనెల చివరి వారంలో బీవీఎస్సీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. టీబీసీ అతిథిగృహం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 85,626 మంది స్వామివారిని దర్శించుకోగా 33,138 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ఆదాయం రూ. 3.13 కోట్లు వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలు తీసుకువస్తున్న అర్చకులు

రాపూరు : పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో పవిత్రాలు సమర్పించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను తిరుచ్చిపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయం శ్రీలక్ష్మీనృసింహ స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ దేవికి వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. పవిత్రోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

19న తడలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్ : తడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన యువతీ యువకులు ముందుగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9154449677 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఓజోన్‌పై అవగాహన



బహుమతులు అందిస్తున్న అధికారులు

తిరుపతి(అలిపిరి): స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ విదార్థులకు ఓజోన్ పొరపై అవగాహన కల్పించారు. అలాగే పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, కాలుష్య నియంత్రణ మండలి అడ్మినిస్ట్రేషన్ అధికారి అశోక్, విశ్లేషకుడు కుమార్, పురుషోత్తంపాల్గొన్నారు.

అడుగడుగునా ఆటంకాలు




పుంగనూరులో ఎంపీ వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు

- ఎంపీ మిథున్ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

పుంగనూరు: నియోజకవర్గ పర్యటనకు వచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. పట్టణానికి సోమవారం వచ్చిన ఎంపీని కృష్ణదేవరాయ సర్కిల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలో అధిక సంఖ్యలో పోలీసులు మోహరించారు. కాన్వాయ్ వాహనాలను అన్నింటినీ అనుమతించేది లేదని, రూరల్ సీఐ రాంభూపాల్ స్పష్టం చేయడంతో ఎంపీ మిథున్ రెడ్డి ఫోన్‌లో ఎస్పీతో మాట్లాడారు. ఆదీంతో ఏడు వాహనాలను మాత్రమే అనుమతించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఎంపీని కలిసేందుకు విచ్చేసిన ప్రజలు, కౌన్సిలర్లను పోలీసులు అనుమతించలేదు. పట్టణంలోని కొత్తయిండ్లు, అంబేడ్కర్‌సర్కిల్, గోకుల్ సర్కిల్, తూర్పు మొగసాల, మున్సిపల్ ఆఫీసు వద్ద, కొత్తకోట క్రాస్ వద్ద, చదళ్ల క్రాస్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. వైఎస్సార్‌సీపీ అభిమానులను, కార్యకర్తలను ఎంపీని కలుసుకోనివ్వకుండా అడ్డుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో బాంబ్‌స్క్వాడ్, మెటల్ డిటెక్టర్లు పెట్టి ప్రజలను సోదాలు చేశారు.

రాజకీయాలు కాదు.. అభివృద్ధిలో ఆదర్శంగా నిలవండి



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి


''రాజకీయాలు ఐదేళ్లకొక్కసారే చేయాలి.. నిజాయితీ ఉంటే పుంగనూరు నియోజకవర్గాన్ని మాకన్నా ఎక్కువగా అభివృద్ధి చేయండి.. ఆదర్శంగా నిలవండి. హుండాయ్ కంపెనీ సహకారంతో పుంగనూరులో ఏర్పాటు చేస్తున్న జర్మన్ పెప్పర్ మోషన్ బస్సులు, ట్రక్కుల కంపెనీని ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి.. ముస్లింల మనుగడకు విఘాతం కలిగించే ఏబిల్లునైనా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు అడ్డుకుంటాం'' ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి పుంగనూరు మున్సిపాలిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసి , దాడులు, అక్రమ కేసులపై దృష్టి పెట్టిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాటర్‌గ్రిడ్ ద్వారా సాగునీరు–తాగునీరు అందించేందుకు టెండర్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే జర్మన్ పెప్పర్‌మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ భూసేకరణ పూర్తి అయిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వీటిని పూర్తి చేసి, పుంగనూరు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్టం గురించి, అందులోని లోపాలు గురించి పార్లమెంటరీ కమిటీకి వినతి పత్రం అందజేశామన్నారు. ముస్లిం మైనార్టీలకు ఇబ్బందులు కలిగించే ఏ బిల్లులైనా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

నోటిఫికేషన్.. నో ఓపెన్

తిరుపతి సిటీ: జిల్లాలోని ద్రవిడ, ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీల వీసీల నియామకానికి ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. 20రోజుల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలని కోరింది. అయితే నోటిఫికేషన్ విడుదల చేసి 10 రోజులు గడుస్తున్నా వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. దీంతో ఆశావహులు నానాతంటాలు పడుతున్నారు. దరఖాస్తు గడువు సమీపిస్తున్నా వెబ్‌సైట్ పని చేయకపోవడంతో నిత్యం కంప్యూటర్లకే పరిమితమై ఏ టైమ్‌లో ఓపెన్ అవుతుందో అంటూ ఎదురు చూపులు చూస్తున్నారు. మరికొందరు ఈ విషయంపై ఉన్నత విద్యామండలి అధికారులకు విన్నవించుకుంటున్నారు. త్వరలో వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తామని అధికారులు సమాధానం ఇస్తున్నారు.

ప్రకృతి సేద్యంపై ప్రశంసలు

- మహిళల పాత్రను కొనియాడిన విదేశీ ప్రతినిధులు



పంటలు పరిశీలిస్తున్న మెక్సికో ప్రతినిధి బృందం

భాకరాపేట : ప్రకృతి సేద్యం తీరుతెన్నులపై మెక్సికో ప్రతినిధి బృందం ప్రశంసలు కురిపించింది. సేంద్రియ వ్యవసాయంలో మహిళల పాత్ర అద్భుతమని కొనియాడింది. సోమవారం ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యం పంచాయతీ, చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం పంచాయతీలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలు చేపట్టిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మెక్సికోప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఉదయమాణిక్యం సమైఖ్య సంఘం ప్రతినిధులతో ముచ్చటించింది. మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అమలులో తమ పాత్రను వివరించారు. సేంద్రియ సేద్యంతో చేకూరే ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను తెలిపారు. వ్యవసాయ ఖర్చులు తగ్గడమే కాకుండా ఆరోగ్యపరంగా అనేక లాభాలు ఉంటాయని వెల్లడించారు. అనంతరం చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం గ్రామంలో రైతు సుబ్రమణ్యం వ్యవసాయ క్షేత్రాన్ని మెక్సికో ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు చంద్రశేఖర్, సురేష్‌బాబు, స్మిత, రాజగోపాల్, సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, ప్రాంతీయ సాంకేతిక అధికారి రవిచంద్రప్రసాద్, ఏపీ సీఎస్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, అదనపు మేనేజర్ పట్టాభి పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



అమ్మవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. ఈ క్రమంలో ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. ద్వారతోరణ ధ్వజకుంభ ఆవాహనం, చక్రాది మండలపూజ, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం జరిపించారు. పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, వివిధ రకాల ఫలరసాలతో అభిషేకం చేశారు. సిరులతల్లిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, ఏఈఓ రమేష్, అర్చకుడు బాబు స్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రవచనకర్తల అంగీకార పత్రాలకు ఆహ్వానం

తిరుపతి (అలిపిరి): ధనుర్మాసంలో ఈ ఏడాది డిసెంబరు 16 నుంచి 2025 జనవరి 13వ తేదీ వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ప్రవచించేందుకు శ్రీవైష్ణవ సిద్ధాంతం తెలిసిన విద్వాంసుల నుంచి అంగీకార పత్రాలు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. అర్హులైనవారు అక్టోబరు 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రత్యేకాధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, శ్వేత భవనం, టీటీడీ, తిరుపతి–517502 అనే చిరునామాకు తమ అంగీకార పత్రాలు పంపాలని సూచించారు. నమూనాను www.tirumala.org వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు నంబర్లు 96761 20226, 8978734947 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాడి రైతులకు అవగాహన


మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారులు

రామచంద్రాపురం: పాడి రైతులకు పశువులకు సోకే వ్యాధులపై అవగాహన అవసరమని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం డీడీ బాల సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం మండలంలోని పీవీపురం గ్రామంలోని రైతులకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులు, మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పశు వైద్యాధికారులు కిషోర్, హేమ కుమార్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ తిరమల రెడ్డి, జనార్ధన్ చౌదరి, రాజేష్, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

తడ: బైక్‌ల చోరీలో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సూళ్లూరుపేట బాపూజీ కాలనీకి చెందిన కంకి వంశీతోపాటు, కొమ్మినేనిపల్లెకు చెందిన అనుమానితుడు బందిలి సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు . ఎస్‌ఐ కొండపనాయుడు వెల్లడించారు. వీరి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు..



పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలు ఆడకూడదు. నాలాంటి ఎంతోమంది పేదలు పిల్లలను మెడికల్ విద్య చదివించాలని కలలు కంటుంటాం. పేదలకు మోసం చేయకూడదు. ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు ఇచ్చేయడం అన్యాయం. గత ప్రభుత్వం పేదల కోసం కోట్ల రూపాయాలు ఖర్చు చేసి మెడికల్ కళాశాలలను కట్టించింది. ఇప్పుడెందుకు ఆ కళాశాలలను ప్రైవేటుకు ఇచ్చేయాలని అనుకుంటున్నారు. వైద్య కళాశాలలపై చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు సరైనవి కావు.

– భువనేశ్వరి, విద్యార్థి తల్లి, బంగారుపాళ్యం



ఎందుకింత కక్ష..!



గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీ విధానం గతంలో ఏ నాయకులు చేయలేదు. గత ప్రభుత్వం అమలు చేసిన మెడికల్ కళాశాలల నిర్మాణాలు నాలాంటి పేద విద్యార్థులకు వరం. గతేడాది ఐదు కళాశాలలు ప్రారంభించడంతో ఎంతోమంది పేద, మధ్యతరగతి విద్యార్థులు సీట్లు పొందారు. ఆ కళాశాలల్లో ప్రస్తుతం బాగా చదువుకుంటున్నారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ విద్య చదవాలంటే ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి. అలాంటి పరిస్థితులను గత ప్రభుత్వం రూపుమాపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విషయంలో పునరాలోచించాలి. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న అన్ని కళాశాలల పనులు వేగవంతంగా పూర్తి చేయించి విద్యాబోధన చేయించాలి.

– కిషన్, నీట్ విద్యార్థి, చిత్తూరు

వినూత్న ఆలోచనలు.. అద్భుత ఆవిష్కరణలు

వినూత్న ఆలోచనలతో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. విభిన్న ప్రయోగాలతో మానవాళికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. జీవనశైలిని మరింత సులభతరం చేస్తాయి. ఈ దిశగా తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ విద్యార్థులు నవీన ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నారు. ఇన్నోవేటివ్ ఐడియాలతో భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న పోటీల్లో సత్తా చాటేందుకు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకున్నారు.

- తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల నవీన ప్రయోగాలు
- రాష్ట్ర స్థాయి సెట్విన్ పోటీలకు ఎంపికైన రెండు ప్రాజెక్టులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు కొత్త ఐడియాలతో సరికొత్త ఆవిష్కరణల దిశగా ముందుకు సాగుతున్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని 2025, జనవరి 12న 28వ జాతీయ యువజన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. అందులో భాగంగా కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యువతకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే సెట్విన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో వివిధ రకాల పోటీలు చేపట్టింది. ఈ పోటీల్లో భాగంగా ఇటీవల తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ''ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ'' అనే అంశంపై డిప్లొమా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన సుమారు 100మందికి పైగా విద్యార్థులు తమ ఆలోచనలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో కంప్యూటర్ విభాగానికి చెందిన విద్యార్థినులు ప్రజంటేషన్ చేసిన ''హాస్పిటల్ దయాగ్నసిస్ వెబ్‌సైట్'', అలాగే మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థులు పవర్ పాయింట్ ద్వారా ప్రజంటేషన్ చేసిన ''వర్టికల్ విండ్ మిల్‌తో ఉజ్వల భవిష్యత్తు'' అనే ఈ రెండు ఐడియాలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఈ రెండు ఐడియాల పనితీరు, వాటి వలన ఉపయోగాలను ఈ సందర్భంగా విద్యార్థులు సాక్షికి వివరించారు.



భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ అనే కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న హాస్పిటల్ దయాగ్నసిస్ వెబ్‌సైట్

హాస్పిటల్ దయాగ్నసిస్ వెబ్‌సైట్

భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ అనే కాన్సెప్ట్‌తో హాస్పిటల్ దయాగ్నసిస్ వెబ్‌సైట్‌ను ఏఐ టూల్ వినియోగించి రూపొందిస్తున్నాం. ప్రస్తుత కాలంలో పని ఒత్తిడి, ఆహారపు అలవాట్లు తదితర కారణాలతో వివిధ వ్యాధుల బారిన పడుతుంటారు. తీరిక, ఓపిక లేకపోవడంతో హాస్పిటల్‌కు వెళ్లి వైద్యం తీసుకోవడం లేదు. సరైన సమయంలో చికిత్స పొందకపోవడంతో భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది. దీనికోసమే హాస్పిటల్ దయాగ్నసిస్ అనే వెబ్‌సైట్ రూపొందిస్తున్నాం. ఇది వర్చువల్ హెల్త్ కేర్. ఈ వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుంచే వర్చువల్‌గా డాక్టర్‌ను కలవవచ్చు. తమ సమస్యలకు వైద్యం తీసుకోవచ్చు. వ్యాధి తీవ్రం కాకముందే ముందస్తు జాగ్రత్త పొందవచ్చు. చర్మ తదితర వ్యాధులను ఫొటో తీసి పంపిస్తే స్పెషలిస్ట్ ద్వారా సరైన వైద్యం పొందవచ్చు. ఈ వెబ్‌సైట్ హెల్త్ ట్రాకర్‌గాను, రెమిండర్‌గాను పనిచేస్తుంది. ఈ వెబ్‌సైట్ 24/7 అందుబాటులో ఉంటుంది. ఇంటర్‌నెట్‌తో కూడిన సెల్ ఫోన్ ఉంటే చాలు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లోని వారికి ఈ వెబ్‌సైట్ ద్వారా సరైన వైద్య సేవలు సకాలంలో అందుతాయి.


జె.స్ఫూర్తి, వరీష అంజుం, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్

వర్టికల్ విండ్ మిల్..




విద్యుత్ వాడకం ప్రారంభమయ్యాక మానవ జీవనశైలి మరింత మెరుగు పడింది. బొగ్గు, అణు ధార్మిక శక్తి ద్వారా విద్యుత్ ఉత్పన్నమవుతున్నా వీటి వలన వాయి కాలుష్యం కలవర పెడుతున్న అంశం. ఇక గాలి, నీరు, సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. ఇందులో గాలిమర ద్వారా విద్యుత్ పొందుతున్నప్పటికీ, ఒక్కో గాలి మర ఏర్పాటు చేయడానికి ఖర్చుతో పాటు చాలా స్థలం అవసరమవుతుంది. ఒక్క సారి ఈ గాలి మరను ఏర్పాటుచేస్తే ఆ దిశగా గాలి వీచినప్పుడు మాత్రమే శక్తి ఉత్పన్నమవుతుంది. దాదాపు 90మీటర్ల ఎత్తుగా ఉండే ఈ గాలి మర నిర్వహణ, మరమ్మతులు వ్యయప్రయాసతో కూడుకున్నవి. అలాగే వీటిని ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసేందుకు వీలుండదు. ఇక సోలార్ ఎనర్జీ సైతం ఖర్చుతో కూడుకున్నదే. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే సోలార్ ఎనర్జీ లభిస్తుంది. ఈ నేపథ్యంలోనే బ్రైట్ ఫ్యూచర్ త్రూ వర్టికల్ విండ్ మిల్ అనే కాన్సెప్ట్‌ను ముందుకు తీసుకొచ్చాం. ఈ విండ్ మిల్ తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనాలు సొంతం. 5నుంచి 10అడుగులలోపు ఎత్తు కలిగిన ఈ వర్టికల్ విండ్ మిల్‌ను ఇల్లు, ఆఫీసు, హైవేలు, వాణిజ్య కేంద్రాలు ఇలా ఎక్కడైనా ఏర్పాటుచేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో అధిక విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు.

– డి.దివాకర్, ఎస్.శివమణి, ఎ.జేసస్ నెవిన్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్

పవిత్రం.. పెరటాసి మాసం


అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మాలధారణలతో తిరుమలకు వెళుతున్న ఇతర రాష్ట్రాల భక్తులు

- నేటి నుంచి ఆరంభం

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారు అవతరించిన పవిత్రమైన పెరటాసి మాసం మంగళవారం ప్రారంభమవుతోంది. ఈ మాసంలోనే శ్రవణ నక్షత్రంలో తిరుమలేశుడు సాక్షాత్కరించినట్లు వేంకటాచలమహత్యం చెబుతోంది.

కాలినడకన కొండకు..

పెరటాసి మాసంలో శ్రీవారికి ప్రీతి పాత్రమైన శనివారాలను తమిళులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. అనంతరం కుటుంబ సమేతంగా తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. వీలులేని పడని పక్షంలో తమ ఊరిలోని శ్రీవైష్ణవ దేవాలయాలకు వెళ్లి స్వామివారిని సేవించుకుంటారు. గ్రామీణులు ఊళ్లకు ఊళ్లుగా కదిలి కాలినడకన తిరుమల బాటపడతారు. కొండకు చేరుకుని తలనీలాలు సమర్పించి వైకుంఠనాథుని దర్శించుకుంటారు. సుమారు వెయ్యేళ్లుగా ఈ ఆచారం సాగుతోందని చరిత్ర. పవిత్ర పెరటాసి మాసంలో భక్తులు నియమ నిష్ఠలు పాటించాలని స్కంధపురాణం చెబుతోంది. ఈ నెలలోనే నవవాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నందున పెరటాసిని శ్రీవారి తిరునాళ్ల మాసంగా కూడా పిలుస్తారు. పెరటాసిలో మొదటి శనివారం ఈ నెల 21వ తేదీన మొదలై అక్టోబర్ 19న చివరి శనివారంతో ముగుస్తుంది.

వేడుకగా ఊంజల్‌సేవ


ఊంజల్ సేవలో ఆదిదంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు సోమవారం వేడుకగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ముందుగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వేదమంత్రోచ్చరణల మధ్య ఊంజల్‌సేవ జరిపించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సుమారు 40వేలమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 టికెట్‌తో 3,236మంది, రూ.50 టికెట్‌తో 2,584మంది భక్తులు దర్శించుకున్నట్లు వెల్లడించారు. రూ.500 రాహుకేతు పూజలను 2,726మంది, రూ.750 పూజలను 1,454మంది, రూ.1,500 పూజలను 468మంది, రూ.2,500 పూజలను 286మంది, రూ.5వేల రాహుకేతు పూజలు 69 జరిపించుకున్నట్లు వివరించారు.

ట్రాక్టర్ దగ్ధం



శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చియ్యవరంలో సోమవారం ట్రాక్టర్ దగ్ధమైంది. పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్‌ను వినియోగించి భోజనం చేసేందుకు వెళ్లి వచ్చే సరికి ట్రాక్టర్ కాలిపోతూ కనిపించిందని బాధితుడు వయ్యావూరు మాధవయ్య తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చికిత్సపొందుతూ బాలుడి మృతి


మహేష్ (ఫైల్)

బాలాయపల్లి(సైదాపురం) : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలులో ఆదివారం బాణసంచా పేలి 30 మంది గాయపడిన ఘటనలో చికిత్సపొందుతూ సోమవారం ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన కందలి శ్రీనివాసులు, భార్గవి దంపతుల కుమారుడు మహేష్ (12) మనుబోలులోని అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. గ్రామంలో జరుగుతున్న గణేష్ నిమజ్జనోత్సవానికి వెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు బాణసంచా పేలింది. క్షతగాత్రులను నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మహేష్ మరణించాడు. దీంవతో పిగిలాం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి


కృష్ణయ్య మృతదేహం

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం దరఖాస్తు గ్రామంలో సోమవారం ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన డ్రైవర్ క్రిష్ణయ్య(48) ఎరువు తోలేందుకు ట్రాక్టర్‌లో వెళ్లాడు. ఎరువు అన్‌లోడ్ చేసి కిందకు దిగుతుండగా పంచె తగులుకుని కింద ట్రాక్టర్ కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతను మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిపూర్ణం.. పవిత్రోత్సవం


పవిత్రోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: మండలంలోని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం సాయంత్రం పూర్ణాహుతితో పరిపూర్ణమయ్యాయి. ముందుగా ప్రధాన ఆలయంలోని మూలమూర్తిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన జరిపించారు. స్వామి, అమ్మవారి ఉత్సవర్లను కల్యాణమండపంలోకి వేంచేపు చేశారు. వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, ఆచార్య బహుమానం సమర్పణ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి దంపతులతో పాటు తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు. కంకణం ధరించి ఉత్సవాలు నిర్వహిస్తున్న చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులు పవిత్ర హోమ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభం


బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్

తిరుపతి కల్చరల్ : జీకార్ స్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను తిరుమల బైపాస్ రోడ్డులోని టీఎంఆర్ కల్యాణ మండపం పక్కన భవనంలోకి మార్చి సోమవారం ప్రారంభించారు. బ్యాంకు జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, రీజనల్ హెడ్ సి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యంగా తవ బ్యాంక్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. గృహ, బంగారు, వాహనాలకు సంబంధించిన లోన్‌లను 8.35 శాతం, వ్యాపార రుణాలను 8.50 శాతం వడ్డీతో అందించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ బి.రాజీకమల్, డాక్టర్ ఆర్.రఘురాములు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ఉన్న శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయానికి సమీపంలో ఆదివారం మూర్ఛ వ్యాధికి గురై వెంకటేశ్వర్లు అనే వృద్ధుడు పడిపోయాడు. స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం ఉదయం వృద్ధుడు మరణించాడు. మృతుడు సత్యవేడు ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించామని, వివరాలు తెలిసినవారు 9440900726, 9440796767 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ రామస్వామి కోరారు.

లారీ ఢీకొని గేదెల మృతి



రాపూరు : మండలంలోని సిద్ధవరం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం లారీ ఢీకొని ఆరు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఇందులో డక్కిలి మండలం మాధవయ్యపాళెం గ్రామానికి చెందిన వెంకురెడ్డికి చెందిన 3 గేదెలు, గోవిందమ్మకు చెందిన 2, కవితకు చెందిన ఒక గేదె మరణించాయి. గేదెలను ఢీకొన్న లారీ పక్కనే పొదల్లోకి దూసుకెళ్లింది. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ 2 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఇసుక లారీలు పట్టివేత


పోలీస్ స్టేషన్ వద్ద లారీలు

ఏర్పేడు : మండలంలోని వికృతమాల సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు లారీలను ఆదివారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. కొందరు అక్రమార్కులు స్వర్ణముఖి నదినుంచి ట్రాక్టర్‌ల ద్వారా అక్రమంగా ఇసుక తరలించి ఈ ప్రైవేట్ వెంచర్ పక్కన డంపింగ్ చేసుకుని రాత్రిళ్లు లారీలతో ఇతర ప్రాంతాలకు తీసుకెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గ్రామస్థుల సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు మొత్తం లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై సీఐ జయచంద్రను వివరణ కోరగా లారీ డ్రైవర్లు పరారైనట్లు తెలిపారు.